

టీఎస్ఎఫ్‌డీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డికి గోల్ఫ్‌కార్ట్ బ్యాటరీ వాహనాల తాళం చెవి అందిస్తున్న ఎస్‌బీఐ సైబరాబాద్ డీజీఎం కుమార్ రోహిత్

### బొటానికల్ గార్డెన్‌కు 2 వాహనాలు విరాళం

హైదరాబాద్, డిసెంబర్6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ, బొటానికల్ గార్డెన్‌కు ఎస్‌బీఐ గచ్చిబౌలి బ్రాంచి విరాళంగా రెండు గోల్ఫ్ కార్ట్ బ్యాటరీ వాహనాలను బుధవారం అందజేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా టీఎస్ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ చంద్రశేఖర్‌రెడ్డికి ఎస్‌బీఐ సైబరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కుమార్ రోహిత్, రీజినల్ మేనేజర్ రాజన్ కుమార్ ఆ వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు, పెద్దలకు ఈ వాహనాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ సేల్స్ మేనేజర్ ఉమాకాంత్, యోనో హైటెక్ సిటీ, గచ్చిబౌలి బ్రాంచి మేనేజర్ సౌజన్య, రమేశ్, ఈడీ రంజిత్‌నాయక్, డైరెక్టర్ ఎంజే అక్బర్, ఓఎస్డీ ఎకో టూరిజం తిమ్మారెడ్డి, జీఎం గిలకత్తుల సైలాబ్, డీఎఫ్‌సీ కిరణ్‌కుమార్, ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్ వీ లక్ష్మిరెడ్డి, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్‌రెడ్డి, బోటనిస్ట్ డాక్టర్ వీరకిశోర్, శాంసన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీకి ఎన్నికల ఆదాయం రూ.24 కోట్లు

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు టీఎస్ఆర్టీసీకి బాగా కలిసొచ్చాయి. ఈ ఎన్నికల సందర్భంగా అక్టోబర్ 9 నుంచి నవంబర్ 29 వరకు వివిధ రాజకీయ పార్టీలకు 10,587 బస్సులను అద్దెకు ఇవ్వడం ద్వారా ఏకంగా రూ.24.13 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. ఎన్నికల సభలకు జనాన్ని తరలించేందుకు ఈ బస్సులు మొత్తం 26,22,176 కి.మీ. దూరం తిరిగాయని, తద్వారా కిలోమీటర్‌కు సగటున రూ.92.05 చొప్పున ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు. దీనితోపాటు పోలింగ్ సామాగ్రి, ఎన్నికల అధికారుల తరలింపునకు 4,006 బస్సులను అద్దెకు తీసుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్.. ఒక్కో బస్సుకు రోజూ రూ.20 వేల చొప్పున అద్దె చెల్లించినట్టు తెలిపారు.

# సింగరేణిలో యువతకు సారథ్యం!

- యూనియన్ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామన్న కవిత
- కార్మిక సంఘం నేతలతో హైదరాబాద్‌లో చర్చలు



హైదరాబాద్‌లో బుధవారం టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కవితను కలిసిన టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు, మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): సింగరేణిలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించామని, అదే స్ఫూర్తితో నాయకత్వ సారథ్యంలోనూ యువతకు ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సింగరేణి ఎన్నికల నేపథ్యంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య బుధవారం హైదరాబాద్‌లో కవితను కలిసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఈసారి తమ యూనియన్‌లో యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తామని, 66 శాతం వరకు నాయకత్వ బాధ్యతల్లో అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. 1998లో ఆగిపోయిన కారుణ్య నియామకాలను 2018లో కేసీఆర్ తిరిగి పునరుద్ధరించి వేలాది మందిని నియమించారని పేర్కొన్నారు. కారుణ్య నియామకాల ద్వారా మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. 1999-2000లో లాభాల్లో కార్మికులకు కేవలం 10 శాతం వాటా ఉండేదని, తెలంగాణ ఏర్పడినప్పుడు 18 శాతంగా ఉండేదని, దాన్ని కేసీఆర్ 32 శాతానికి పెంచారని వివరించారు. పదవీ విరమణ వయస్సును 60 నుంచి 61 కి పెంచామని, గతంలో సమ్మె చేస్తే సంస్థ జీతం ఇచ్చేది కాదని, తెలంగాణ ఉద్యమ సమయంలో 35 రోజుల పాటు సాగిన సకలజనుల సమ్మెలో పాల్గొన్న వారికి రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పూర్తి జీతం ఇచ్చారని ప్రస్తావించారు. సింగరేణిని కష్టాల నుంచి కాపాడిన బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌ను ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. టీబీజీకేఎస్‌ను గెలిపించుకుంటేనే కార్మికులకు న్యాయం జరుగుతుందని, కార్మికుల పక్షాన నిలబడే సంఘం టీబీజీకేఎస్ అని చెప్పారు.

### 62 మంది ఇంజినీర్లకు నివాళి

హైదరాబాద్, డిసెంబర్6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఇంజినీర్ల స్మారక దినోత్సవం సందర్భంగా బుధవారం జలసౌధలో నిర్వహించిన కార్యక్రమంలో దివంగత ఇంజినీర్లకు ఘనంగా నివాళులర్పించారు. నవాజ్ అలీ జంగ్ బహదూర్ వర్ధంతి రోజైన డిసెంబర్ 6న ప్రతి ఏటా 'తెలంగాణ ఇంజినీర్ల మెమోరియల్ డేగా నిర్వహిస్తూ వస్తున్నారు. గత ఏడాది కాలంలో అన్ని శాఖల్లో మృతిచెందిన 62 మంది ఇంజినీర్లను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి చిత్రపటాల ఎదుట కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. బీఆర్ అంబేద్కర్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కూ నివాళులర్పించారు. కార్యక్రమంలో సాగునీటి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు మురళీధర్, అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, చీఫ్ ఇంజినీర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

# 20 నుంచి ఓటర్ల జాబితా సవరణ

- లోక్‌సభ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ కసరత్తు
- ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితా
- సీఈవోలతో రెండుసార్లు ఈసీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): వచ్చే ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నది. ఓటర్ల జాబితా సవరణపై దృష్టి సారించింది. వచ్చే ఏడాది దేశవ్యాప్తంగా జరుగనున్న ఈ ఎన్నికల కోసం ఈ నెల 20 నుంచి జనవరి 5 వరకు ఓటరు జాబితా సవరణ దరఖాస్తులకు అవకాశం కల్పించింది. ఓటు హక్కు లేనివారితోపాటు జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండినవారు, చిరునామా మారినవారు, ఓటరు జాబితాలో పేర్లు, ఇతర వివరాలు తప్పుగా పడినవారు దరకాస్తు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. మరణించిన, చిరునామా మారిన ఓటర్ల వివరాల సేకరణ కోసం స్థానిక జాతీయ, ప్రాంతీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులతో ఈ నెల 15న, వచ్చే నెల 12న ఢిల్లీలో సమావేశాలను నిర్వహించనున్న ఈసీ.. ఫిబ్రవరి చివరి నాటికి ఎన్నికల ఏర్పాట్లు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నది. త్వరలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించి, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

# పంచాయతీ ఎన్నికలు జరిగేనా?

- జనవరితో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- కొత్త ప్రభుత్వం నిర్ణయంపైనే పంచాయతీల భవిత
- ఇంకా కొలిక్కిరాని బీసీ రిజర్వేషన్ల పంచాయితీ

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): జనవరి 31తో పంచాయతీల గడువు ముగియనున్న నేపథ్యంలో.. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీనాటికే రాష్ట్రంలో కొత్త సర్పంచులు, వార్డు సభ్యులు కొలువుదీరాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ లేఖ రాశారు. ప్రతి జిల్లాలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులను గుర్తించాలని, వారి వివరాలను 'టీ పోల్'లో నమో దు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను ఈ నెల 30లోపు పూర్తిచేయాలని చెప్పారు.

### ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి

పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలి. మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడానికి ముందు పంచాయతీ ఎన్నికల గురించి ప్రభుత్వంలోని అన్ని స్థాయిల్లో చర్చ జరగాల్సి ఉంటుంది. ఇందుకు కొత్త సమయం పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### రిజర్వేషన్ల అంశం తేలలేదు

మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని స్థిరీకరించే అంశం ఒకటి పెండింగ్‌లో ఉన్నది. రిజర్వేషన్ల అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం బీసీ కమిషన్‌ను నివేదిక కోరింది. అయితే బీసీ కమిషన్ ఇంతవరకు నివేదిక ఇవ్వలేదు. ఇప్పటికిప్పుడు బీసీ కమిషన్ నివేదిక ఇచ్చినా దాన్ని ప్రభుత్వం ఆమోదించి ఎన్నికలపై నిర్ణయం తీసుకొనేందుకు కనీసం మరో నెల రోజులు పట్టేలా ఉన్నది. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 224 గ్రామపంచాయతీల ఏర్పాటుకు సంబంధించిన అంశం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నది. ఒకవేళ గవర్నర్ ఆమోదం తెలుపకపోతే.. మళ్లీ అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కొత్త ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో తెలియదు. జనవరిలో పంచాయతీలకు ఎన్నికలు జరగకపోతే పర్సన్ ఇన్‌చార్జిలను పెట్టే అవకాశం ఉన్నది. ఫిబ్రవరి-మార్చిల్లో లోక్‌సభ ఎన్నికల సందడి మొదలై మే నాటికి ముగుస్తుంది. ఆ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు సంబంధించిన ఎన్నికలు కూడా ఉన్నాయి. పంచాయతీల ఎన్నికలను కూడా జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలతోపాటే పెట్టే అవకాశం ఉన్నదని పలువురు నిపుణులు చెప్తున్నారు.

# భూకంపాలు డబుల్

- నిరుడితో పోల్చితే ఈసారి రెట్టింపు
- తక్కువ తీవ్రత కలిగినవే ఎక్కువ
- పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): గతంతో పోల్చితే ఈ ఏడాది దేశంలో భూకంపాలు రెట్టింపు అయ్యాయి. 2020 నుంచి ఇప్పటివరకు భూకంపాల వివరాలు ఇవ్వాలని ఓ ఎంపీ కోరగా, కేంద్రం బుధవారం రాతపూర్వక సమాధానం ఇచ్చింది. ఈ నివేదిక ప్రకారం 2020 నుంచి ఈ ఏడాది నవంబర్ వరకు నాలుగేండ్లలో మొత్తం 310 భూకంపాలు సంభవించాయి. నిరుటితో పోల్చితే ఈసారి భూకంపాల సంఖ్య రెట్టింపయ్యింది. 2020లో 61, 2021లో 60, 2022లో 64 భూకంపాలు నమోదు కాగా.. ఈ ఏడాది 11 నెల్లలోనే 124 ప్రకంపనలు రికార్డయ్యాయి. ఇందులో 97 ప్రకంపనల 3.9 లోపే నమోదు కావడంతో పెద్దగా ప్రమాదం జరగలేదు. పశ్చిమ నేపాల్‌లోని ఆల్మోరా ఫలకం యాక్టివ్ కావడం వల్లే భూకంపాల సంఖ్య పెరిగిందని అధికారులు తెలిపారు. దీనివల్ల ఈ ఏడాది జనవరి 24న (5.8 తీవ్రతతో), అక్టోబర్ 3న (6.2 తీవ్రతతో), నవంబర్ 3న (6.4 తీవ్రతతో) భారీ భూకంపాలు సంభవించాయని వెల్లడించారు. వీటి ప్రభావంతో హిమాలయాల చుట్టూ భూకంపాలు కొనసాగాయని, తక్కువ స్థాయిలో వరుస ప్రకంపనలు నమోదయ్యాయని తెలిపారు. 2020తో పోల్చితే భారీ భూకంపాల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది.

| భూకంప తీవ్రత | నమోదైన భూ కంపాలు | | | |
|---|---|---|---|---|
| | 2020 | 2021 | 2022 | 2023 |
| 3.0-3.9 | 42 | 41 | 41 | 97 |
| 4.0-4.9 | 18 | 18 | 20 | 21 |
| 5.0-5.9 | 1 | 1 | 3 | 4 |
| 6.0-6.9 | 0 | 0 | 1 | 2 |

# తగ్గిన విద్యుత్తు డిమాండ్

- ఒక్క రోజులో తగ్గిన 1200 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): తుఫాను ప్రభావం విద్యుత్తు డిమాండ్‌ను తగ్గించింది. ఒకే ఒక్క రోజులో సుమారు 1200 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ తగ్గడం విశేషం. మిగ్‌జాం తుఫాను కారణంగా దాదాపు అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరం చల్లబడింది. గృహ, వాణిజ్య రంగాలతో పాటు, యాసంగి వరి నార్లు పోస్తున్న నేపథ్యంలో.. వ్యవసాయరంగంలోనూ మోటర్ల వినియోగం చాలా వరకు తగ్గింది. ఒక్కసారిగా మూడు ముఖ్యమైన రంగాల్లో విద్యుత్తు వినియోగం తగ్గడంతో డిమాండ్ పడిపోయింది.

### 1200 మెగావాట్ల తగ్గుదల

రాష్ట్రంలో ఈ నెల 4న 10,264 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదవ్వగా.. 5న 9,079 మెగావాట్లకు తగ్గింది. ఒక్క రోజులో సుమారు 1200 మెగావాట్లు తగ్గింది. బుధవారం (ఈనెల 6న) మరింత తగ్గి 8,892 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. తుఫాను ప్రభావం ఈనెల 7 తరువాత తగ్గనుందని వాతావరణ శాఖ చెప్పడంతో.. విద్యుత్తు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నిరుడు ఇదే సమయంతో పోల్చితే ఈ యేడాది విద్యుత్తు డిమాండ్ గణనీయంగా తగ్గింది.

**2022, 2023 సంవత్సరాల్లో డిసెంబరు 1 నుంచి 6 వరకు నమోదైన విద్యుత్తు డిమాండ్ (మెగావాట్లలో)**

| డిసెంబర్ | 2022 | 2023 |
|---|---|---|
| 1 | 10,041 | 9,742 |
| 2 | 10,377 | 9,993 |
| 3 | 10,171 | 9,839 |
| 4 | 9,684 | 10,264 |
| 5 | 10,356 | 9,079 |
| 6 | 10,466 | 8,892 |


